
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 26.8, కనిష్ఠం 16.2
కామారెడ్డి జిల్లా వార్తలు
5
శుక్రవారం 12 జనవరి 2024



బాల్య వివాహాలను అరికట్టాలి

తాడ్వాయి, జనవరి 11: బాల్య వివాహాలను అరికట్టాలని తాడ్వాయి ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులకు ప్రత్యేక అవగాహన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు ఎవరు చేయడానికి ముందుకు వచ్చినా వెంటనే పోలీసులకు, అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఇటీవల సైబర్ నేరాలు అధికమయ్యాయని, సైబర్‌నేరాలపై యువకులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ప్రణాళికలు రూపొందించుకొని కష్టపడాలన్నారు. మైనర్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని మైనర్ డ్రైవింగ్‌ను నిరోధించాలని సూచించారు.



జిల్లాలోని ఓ రైసుమిల్లులో మర ఆడిస్తున్న దృశ్యం



రైసుమిల్లర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

సీఎంఆర్‌పై సర్కారు.. నజర్!

- జిల్లాలో సీఎంఆర్ లక్ష్యం చేరని మిల్లులు
- ఇప్పటికీ ప్రభుత్వానికి చేరని కస్టం మిల్లింగ్ రైస్
- రెండు సీజన్‌లకు సంబంధించి ధాన్యం మిల్లుల్లోనే
- 2.73 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మిల్లర్ల వద్దే
- కస్టం బియ్యం ఇవ్వడంలో సాకులు చెబుతున్న మిల్లర్లు
- మిల్లుల్లో తనిఖీలు చేపడుతున్న కలెక్టర్, జేసీలు
- గడువులోగా ఇవ్వకుంటే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరిక
- ఈనెలాఖరు వరకు గడువు పొడిగింపు
- జిల్లాలో 136 రా.. మరో 35 బాయిల్డ్ రైసుమిల్లులు

కామారెడ్డి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గత ఏడాది వానాకాలం, ఎండా కాలం సీజన్‌లో రైసుమిల్లర్లకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని మర ఆడించి బియ్యం ఇవ్వాల్సిన రైసుమిల్లర్లు ఇవ్వక పోవడంతో వారిపై దృష్టి సారించింది. ఈ నెలాఖరు వరకు బియ్యం ఇవ్వని మిల్లర్లపై కొరడా ఝులిపించాలని ఎంతటి వారినైన సరే కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం ఇప్పటికే జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, పౌర సరఫరాల శాఖ అధికారులు మిల్లర్లపై నిఘా పెట్టడమే కాకుండా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. సీఎంఆర్ ఇవ్వాలంటూ మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. రెండు సీజన్‌లకు సంబంధించి మిల్లర్ల నుంచి ఇంకా ప్రభుత్వానికి 2.75 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. డిసెంబరు నెలాఖరు వరకు పూర్తి చేయాలని ఆదేశించినప్పటికీ మిల్లర్లు టార్గెట్ పూర్తి చేయలేదు. దీంతో ఈ నెలాఖరు వరకు మరోసారి గడువును పొడిగించారు.

జిల్లాలో 179 రైసుమిల్లులు

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 179 రైసుమిల్లులు ఉన్నాయి. ఇందులో 136 రా రైసుమిల్లులు ఉండగా మరో 35కి పైగా బాయిల్డ్ రైసుమిల్లులు ఉన్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 557 రేషన్ దుకాణాల ద్వారా ప్రతీనెల పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2.46 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల ద్వారా ప్రతీనెల 5,450 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీకి ప్రతీ ఏటా రెండు సీజన్‌లలో రైతులు పండించే ధాన్యాన్ని రైసుమిల్లులో మర ఆడించి బియ్యంగా మార్చి పేదలకు పంపిణీ చేస్తుంటారు.

రెండు సీజన్‌ల సీఎంఆర్ మిల్లుల్లోనే..

జిల్లాలో రెండు సీజన్‌లకు సంబంధించి ధాన్యం మిల్లుల్లోనే ఉండిపోయింది. జిల్లాలో 2022-23లో వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి 4.75లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆయా రైసుమిల్లులకు కేటాయించారు. రైసుమిల్లర్లు మిల్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి 3.18 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు 2.68లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను మిల్లర్లు తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు. మరో 50 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు అప్పగించాల్సి ఉంది. 2022-23 యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి 3,64,973 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు కేటాయించారు. ఈ ధాన్యాన్ని మిల్లర్లు మర ఆడించి సీఎంఆర్ కింద తిరిగి ప్రభుత్వానికి 2.46 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తిరిగి అప్పగించాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు 23వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను ప్రభుత్వానికి అప్పగించారు. మరో 2.23 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మిల్లుల వద్దే ఉంది. ఇలా జిల్లాలోని ఆయా రైసుమిల్లుల నుంచి 2.73 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. అదేవిధంగా 2023 వానాకాలానికి సంబంధించి 4.56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు కేటాయించారు. ఈ సీజన్‌కు సంబంధించి ఇంకా మొదలు పెట్టలేదు.

ఈనెల చివరి కల్లా ముగియనున్న గడువు

గత ఏడాది వానాకాలం, యాసంగి సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని పలు రైసుమిల్లులకు ప్రభుత్వం కేటాయించింది. మిల్లర్లు మర ఆడించి సీఎంఆర్ కింద 2.73 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తిరిగి ఇవ్వాల్సి ఉంది. ఈనెల చివరి వరకు ఇవ్వాలని ప్రభుత్వం మిల్లర్లకు గడువు ఇచ్చింది. అయితే ఈ గడువు లోపు మిల్లర్లు నుంచి ఇంకా సీఎంఆర్ బియ్యం అందిస్తారో లేదో చూడాలి. సకాలంలో సీఎంఆర్ అందించని పలు రైసుమిల్లు యజమానులకు నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే గడువు ముగిసిన సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

వానాకాలం సీఎంఆర్ ఆలస్యంపై మిల్లులపై ఒత్తిడి

గత వానాకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ గడువు ఇది వరకే ముగిసింది. అయితే మిల్లుల యాజమాన్యాలు కోరిన నేపథ్యంలో పలుమార్లు గడువును పొడిగించారు. గత సీజన్‌కు కూడా గడువు దగ్గర పడుతుంది. అయితే దీనికి మరోమారు పెంచేందుకు అవకాశం ఉండడంతో మిల్లుల యాజమాన్యాల జోలికి వెళ్లడం లేదని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని గోదాంలు ఖాళీ లేకపోవడం సీఎంఆర్‌తో నిండుగా ఉండడంతో మిల్లర్లు ఇవ్వలేని పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో మిల్లులకు కేటాయింపు, వాటిని తిరిగి ఎఫ్‌సీఐ సేకరణ ప్రారంభంలో కొంత ఆలస్యం చోటు చేసుకుంది. దీంతో సీఎంఆర్ అప్పగించడానికి కొందరు వెసులుబాటు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. వానాకాలం, యాసంగి విషయంలో ఇప్పటికే ఆలస్యం అవడంతో అధికారులు మిల్లర్లు ఒత్తిడి పెంచుతున్నారు.



ఫైనల్‌లో తలపడుతున్న హర్యానా, కర్ణాటక జట్లు



హర్యానా టీంకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అధికారులు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన హర్యానా జట్టు

- రెండో స్థానాన్ని దక్కించుకున్న కర్ణాటక
- హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్
- చివరి మూడు నిమిషాల తర్వాత విజృంభించిన హర్యానా టీం

కామారెడ్డి టౌన్, జనవరి 11: 67వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలు గురువారంతో ముగిశాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గత ఐదు రోజులుగా కొనసాగుతున్న ఈ పోటీల్లో 23 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల నుంచి కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్‌కు హర్యానా, కర్ణాటక జట్లు చేరుకోగా హోరాహోరీగా పోటీలు జరిగాయి. మొదట్లో హర్యానా జట్టు ఆధిక్యతను ప్రదర్శించి పాయింట్లను వరుసగా సాధిస్తూ కర్ణాటక జట్టుకు ఓటమి భయాన్ని రుచి చూపాయి. కానీ కోచ్‌లు చేసిన పలు సూచనలతో కర్ణాటక జట్టు హర్యానా జట్టును గడగడలాడించింది. కానీ చివర మూడు నిమిషాలు ఉండనగా హర్యానా జట్టు మళ్లీ విజృంభించి 58 పాయింట్లు సాధించింది. కర్ణాటక 51 పాయింట్లు సాధించగా 7 పాయింట్లతో హర్యానా విజయం సాధించింది. దీంతో హర్యానా జాతీయ స్థాయి కబడ్డీ పోటీల విజేతగా నిలువగా కర్ణాటక రెండో స్థానం సరి పెట్టుకోవాల్సి వచ్చింది. ఉదయం తెలంగాణ వర్సెస్ ఢిల్లీ జట్లు పోటీ పడగా తెలంగాణ విజయం సాధించి మూడో స్థానానికి పరిమితం అయింది. అనంతరం సాయంత్రం ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ సింధూశర్మలు విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు కామారెడ్డి వేదిక కావడం గర్వకారణమని గత ఐదు రోజులుగా అన్ని జట్ల క్రీడాకారులు తమ సత్తా చాటారని అన్నారు. ఓటమి విజయానికి తొలి మెట్టుగా మారుతుందని ఓటమి చెందిన జట్లు కుంగి పోకుండా మరిన్ని కబడ్డీ పోటీల్లో పాల్గొని విజయం వైపు అడుగులు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలపై.. పర్యవేక్షణ కరువు!

- విధులకు హాజరుకాకున్నా వచ్చినట్లు సంతకాలు
- దేవునిపల్లి పీహెచ్‌సీలో బయటపడ్డ వైద్యుల నిర్వాకం
- ఒకరి సంతకాలు మరొకరు పెడుతున్న వైనం
- పై అధికారులు తనిఖీలు చేయడంతో బయటపడ్డ బాగోతం
- జిల్లాలోని పలు పీహెచ్‌సీల్లోనూ ఇదే తతంగం అంటూ ఆరోపణలు

కామారెడ్డి టౌన్, జనవరి 11: జిల్లాలోని వైద్యా ఆరోగ్య శాఖ పరిధిలోని పీహెచ్‌సీలపై పర్యవేక్షణ కరువవుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది పనితీరును పర్యవేక్షించాల్సిన అధికారులు అలసత్వం వహించడంతో అసలు ఎవరు విధులకు హాజరవుతున్నారు.. ఎవరు హాజరు కావడం లేదనేది తెలియకుండా పోతోంది. నెలలో కనీసం 5 నుంచి 6 సార్లు ఒక్కో పీహెచ్‌సీని పరిశీలించాల్సిన అధికారులు అటువైపుగా కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పీహెచ్‌సీలో పనిచేసే సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాట అనే చందంగా నడుస్తుందని ఆసుపత్రులకు వస్తున్న ప్రజల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం నుంచి వేలాది రూపాయల జీతాలు తీసుకుంటూ ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు వైద్యసేవలు అందించాల్సిన పలువురు వైద్యులు విధులకు హాజరుకాకుండా సంతకాలు వేరేవారితో పెట్టివ్వడం వైద్య ఆరోగ్యశాఖలో చర్చనీయాంశంగా మారింది. సదరు వైద్యులు తమ ప్రైవేట్ క్లినిక్‌లకే సమయం కేటాయిస్తున్నారని ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూ ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రం పనిచేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా దేవునిపల్లి పీహెచ్‌సీలో ఓ వైద్యురాలు విధులకు హాజరుకాకున్నా అటెండెన్స్ రిజిస్టర్‌లో మాత్రం హాజరవుతున్నట్లు సంతకాలు పెట్టడంపై అధికారుల తనిఖీల్లో బయటపడింది. ఇలా ఒక దేవునిపల్లి పీహెచ్‌సీలోనే కాకుండా జిల్లాలోని పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోని పలువురు వైద్యుల పనితీరు ఇలానే ఉందనే విమర్శలు వస్తున్నాయి.

దేవునిపల్లి పీహెచ్‌సీలో ఓ వైద్యురాలి నిర్వాకం

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి పీహెచ్‌సీలో విధులు నిర్వహించే మెడికల్ ఆఫీసర్లు, కింది స్థాయి సిబ్బంది విధులకు హాజరుకాకున్న వచ్చినట్లు రిజిష్టర్లలో సంతకాలు చేస్తున్నారు. గత రెండు రోజులుగా ఆ ఆసుపత్రిలో పనిచేసే జోహ అనే మెడికల్ ఆఫీసర్ విధులకు హాజరుకాకున్నా అందులో పనిచేసే మరో మెడికల్ ఆఫీసర్ రిజిష్టర్‌లో గైర్హాజరైన మెడికల్ ఆఫీసర్ సంతకాలు చేశారు. ఈ నిర్వాకంపై కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు స్థానికులు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ వైద్యాఆరోగ్యశాఖ అధికారులను పీహెచ్‌సీని పరిశీలించాలని ఆదేశించారు. వెంటనే డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ దేవునిపల్లి పీహెచ్‌సీని సందర్శించి విధులకు హాజరుకాకున్నా సదరు మెడికల్ ఆఫీసర్ విచారణ చేపట్టి హాజరుకాని మెడికల్ ఆఫీసర్ సంతకాలను, మరల దానిపై సీఎల్(క్యాజ్‌వల్ లీవ్) అని మార్పుచేసిన సంతకాలను గుర్తించారు. విధులకు హాజరుకాకున్నా సంతకాలు ఎలా వచ్చాయంటూ విధుల్లో ఉన్న మెడికల్ ఆఫీసర్‌ను ప్రశ్నించారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఒకరిద్దరు సిబ్బంది ఇదే పీహెచ్‌సీలో విధులకు హాజరుకావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీహెచ్‌సీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారి అటువైపుగా వెళ్లడం లేదని తెలుస్తోంది. ఆసుపత్రికి వస్తే ఒకరిద్దరు సిబ్బంది మాత్రమే ఉంటారని మిగిలిన వారు ఇలా వచ్చి అలా వెళ్లిపోతుంటారని ఏదైన చిన్నపాటి అనారోగ్యం వస్తే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వస్తే అందుబాటులో వైద్యులు లేకపోవడంతో నానా అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ పీహెచ్‌సీలపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు విధులు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దేవునిపల్లి పీహెచ్‌సీలో విచారిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

ప్రైవేట్ ప్రాక్టీస్‌కే మొగ్గు

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న పలువురు వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్‌కే మొగ్గు చూపుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో 22 పీహెచ్‌సీలు ఒక అర్బన్ పీహెచ్‌సీతో పాటు పలు బస్తీ దవాఖానాలు ఉన్నాయి. ఈ ఆసుపత్రులలో పెద్ద మొత్తంలో మెడికల్ ఆఫీసర్‌లు విధులకు ఎగనామం పెడుతున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఒక్కో మెడికల్ ఆఫీసర్ రూ.90వేల వరకు నెల జీతం ప్రభుత్వం నుంచి తీసుకుంటూ కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదని తెలుస్తోంది. అందుకు నిదర్శనమే దేవునిపల్లి పీహెచ్‌సీలోని మెడికల్ ఆఫీసర్ నిర్వాకం అసలు విధులకు హాజరుకాకున్నా వచ్చినట్లు సంతకాలు చేయడం ఆ సంతకాలను సైతం మరో మెడికల్ ఆఫీసర్ పెట్టడాన్ని చూస్తుంటే పేద ప్రజలకు వైద్యం అందించేందుకు కాకుండా ఫ్రీగా ప్రభుత్వ జీతం తీసుకునేందుకే పని చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

విధులకు హాజరుకాకున్నా సంతకాలు చేసినట్లు గుర్తించాం

● చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, కామారెడ్డి

దేవునిపల్లి పీహెచ్‌సీలో ఓ మెడికల్ ఆఫీసర్ విధులకు హాజరుకాకున్నా సంతకాలు చేస్తున్నారని కలెక్టర్‌కు స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు పీహెచ్‌సీని తనిఖీ చేపట్టాను. తనిఖీల్లో జోహ అనే మెడికల్ ఆఫీసర్ విధులకు హాజరుకాకున్నా హాజరైనట్లు సంతకాలు ఉండడంతో పాటు వాటిపై సీఎల్ అని మార్పు చేసిన వాటిని గుర్తించాం. విధులకు హాజరుకాకున్నా హాజరైనట్లు సంతకాలు చేసినట్లు గుర్తించాం. ఈ విషయాన్ని పై అధికారులకు నివేదించడంతో పాటు సదరు మెడికల్ ఆఫీసర్‌లను వివరణ కోరుతాం.

బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన ఒడ్డె ఓబన్న

బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన స్వాతంత్ర సమరయోధుడు ఒడ్డె ఓబన్న అని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ఓబన్న 217వ జయంతి సందర్భంగా గురు వారం కలెక్టరేట్ ఆవరణలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఓబన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరాటంలో ఒడ్డె ఓబన్న సైనాధ్యక్షుడిగా వీరోచిత పోరాటం చేసిన ధీరుడని అన్నారు. ఈ సమావేశంలో బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శి సూర్య రాజం, ప్రతినిధులు ఒడ్డె శ్రీనివాస్, మధుసూదన్, కొమురయ్య, రమేష్, బాలయ్య, బీసీ సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొబేషనరి ఐపీఎస్‌గా కాజల్

జిల్లాకు నూతనంగా ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారిగా వచ్చిన కాజల్ గురువారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. 75 ఆర్‌ఆర్ 2022 బ్యాచ్‌కు చెందిన కాజల్ ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందింది. ఆరు నెలల పాటు ప్రొబేషనరీ ఆఫీసర్‌గా కామారెడ్డిలో విధులు నిర్వహించనున్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, జనవరి 11: నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 20న నిర్వహించే ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రవేశపరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2,689 మంది బాల, బాలికలు ప్రవేశపరీక్ష రాయనున్నారని తెలిపారు. ఇందుకోసం బాన్సువాడ, దోమకొండ, కామారెడ్డి, బిచ్కుంద, ఎల్లారెడ్డి ప్రాంతాల్లో 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగే ఈ కేంద్రా లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఓఎంఆర్ షీట్‌లో జవాబులు బబుల్ చేయాల్సి ఉంటుందని, విద్యార్థులు తమ వెంట బాల్ పాయింట్ పెన్, పరీక్ష ప్యాడ్, హాల్ టికెట్‌తో పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందే చేరుకోవాలని అన్నారు. పరీక్షహాల్ లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ గాడ్జెస్ అనుమతించబడవని తెలిపారు. ఈ సమావేశంలో విద్యాలయ ప్రిన్సిపాల్ సత్యవతి, డీఎస్పీ మదన్‌లాల్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ భార్గవ్, డీఈవో, డీపీవో, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల కంప్యూటరీకరణ పూర్తి

డిచ్‌పల్లి, జనవరి 11 : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిచ్‌పల్లి మండలం లోని 34గ్రామాల ప్రజాపాలన ధరఖాస్తులు జిల్లాలోనే 100శాతం కంప్యూటీకరణ పూర్తి చేసినట్లు ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మొత్తం 18,090 ధరఖాస్తులు రాగ, వాటిని 45కంప్యూటర్ అపరేటర్లతో ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయించినట్లు వారు తెలిపారు. సంక్రాతి సెలవుల సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు ఈ ప్రక్రియను వేగవంతం చేశారని ఎంపీడీవో, ఎంపీవో తెలిపారు. కంప్యూటీకరణ పూర్తి చేసి డిచ్‌పల్లి జిల్లాలోనే మొదటి స్థానంలో ఉందన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

● 55రకాల వంటకాల ప్రదర్శన



విద్యార్థులు తయారు చేసిన వంటకాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

డొంకేశ్వర్, జనవరి11: సంక్రాంతి పండగ సందర్భంగా జిల్లాలోనే మొట్టమొదటి సారిగా డొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు వంద మంది విద్యార్థులు 55రకాల అధునిక సాంప్రదాయ వంటకాలను తయారు చేసి 28 స్టాళ్ళ ద్వారా ప్రదర్శించారు. విద్యార్థుల్లో ఉత్సహాన్ని నింపేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్‌కుమార్ తెలిపారు. పాఠశాలలో విద్యార్థి దశ నుంచే ఇటువంటి కార్యక్రమాలు చేయడం వల్ల బిజినెస్ మేనేజ్‌మెంట్ స్కిట్స్ డెవలప్‌మెంట్ పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చాయచందు, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాబెరబేగం, మంజుల, విజయలక్ష్మీ, ఎస్ఎంసీచైర్మన్ హరి, రాము, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

కోటగిరి, జనవరి 11 : దేశ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ పేర్కొన్నారు. పొతంగల్ మండలం లోని కల్లూర్, కొడిచర్ల గ్రామాలలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ సాబ్ కా సాత్ సాబ్ కా వికాస్ నినాదంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నవ భారత నిర్మాణంలో అమృత కాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఔన్నత్యంపై ప్రధాని సందేశాన్ని వినిపించి ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. బీమా, ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పోషణ్ అభియాన్ సేవలు పొందాని, చిన్న పిల్లల్లో పోషకాహార లోపం అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మారుతి, ఏపీవో గంగారాం, పంచాయతీ కార్యదర్శి అనిత, ఏఈవో సుప్రియ, హెల్త్ సూపర్‌వైజర్ సాయికుమారి తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా నగర అధ్యక్షుడిగా ధర్మరాజు

నిజామాబాద్ అర్బన్, జనవరి 11 : ట్రస్మా అర్బన్ అధ్యక్షుడిగా స్టార్ వరల్డ్ పాఠశాల చైర్మన్ ధర్మరాజు ఎన్నికయ్యాడు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం నిర్వహించిన ఈ ఎన్నికల అధికారిగా మామిడాల మోహన్, పరిశీలకుడిగా జిల్లా అధ్యక్షుడు జయసింహాగౌడ్, కార్యదర్శి జనార్ధన్, కోశాధికారి నిత్యానందలు వ్యవహరించారు. అధ్యక్ష స్థానానికి ధర్మరాజు, అనుమల క్రాంతి పోటీ పడగా ఓటింగ్‌లో ధర్మరాజు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఎ.శ్రీనివాస్, కోశాధికారిగా నాగరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా కార్యవర్గాన్ని త్వరలోనే ప్రకటిస్తామని జిల్లా అధ్యక్షుడు జయసింహాగౌడ్ తెలిపారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు జయసింహాగౌడ్‌ను ఈ సందర్భంగా కమిటీ ఘనంగా సన్మానించింది. నగరంలో ప్రైవేటు పాఠశాలల బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు ధర్మరాజు తెలిపారు.

'సిరికొండ సమస్యలను పరిష్కరించాలి'

సిరికొండ జనవరి 11 : మండల కేంద్రమైన సిరికొండ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షులు బాకారం నిజామాబాద్ రూరల్ శాసన సభ్యులు డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని కోరారు.

పూర్తయిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్



అభయహస్త దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కమ్మర్‌పల్లి,జనవరి 11: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభయ హస్తం ప్రజాపాలన దరఖాస్తుల నమోదు పూర్తయిందని ఎంపీడీవో సంతోష్‌రెడ్డి తెలిపారు. డిసెంబర్ 28 నుంచి జనవరి 2వ తేదీ వరకు వారం రోజుల పాటు కమ్మర్‌పల్లి మండలంలో అభయహస్తం దరఖాస్తులను ఆయా గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించిన అధికారులు లబ్ధిదారుల నుంచి ఐదు గ్యారెంటీ పథకాలకుగాను ఎంపీడీవో, తహసీల్దార్ రెండు టీంలుగా వివిధ పథకాలకుగాను 12489 దరకాస్తులను స్వీకరించామన్నారు. కాగా ఈ నెల 5వ తేదీ నుంచి దరఖాస్తుల కంప్యూటరీకరణ ప్రారంభంకాగా ఈరోజు వరకు తన టీంకు సంబంధించిన 6వేల దరఖాస్తుల నమోదు పూర్తయిందని ఎంపీడీవో సంతోష్‌రెడ్డి తెలిపారు. కాగా తహసీల్దార్ అంజనేయులు టీంకు సంబంధించిన దరఖాస్తుల ఆన్‌లైన్‌నమోదు గురువారానికి పూర్తి అయినట్లు తెలిపారు. కాగా చివరిరోజు గురువారం డాటా అన్‌లైన్ ఎంట్రి ప్రక్రియను ఎంపీడీవో సంతోష్ రెడ్డి పరిశీలించారు.

19న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఖిల్లా, జనవరి 11: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 19న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణాధికారి ఏ.గోవింద్ తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ ఛైర్మన్ దాదన్నగారి విఠల్‌రావ్ అధ్యక్షత వహిస్తారన్నారు. శుక్రవారం ఉదయం 10.30గంటల నుంచి జిల్లా పరిషత్ సమావేశ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, జిల్లా పరిషత్ సభ్యులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని సీఈవో తెలిపారు.

నేడు కాశీ విశ్వనాథ ఆలయంలో ముగ్గుల పోటీలు

డిచ్‌పల్లి,జనవరి 11: డిచ్‌పల్లి బస్టాండ్ పక్కన గల కాశీవిశ్వనాథ ఆలయంలో సంక్రాంత్రి సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహిస్తునట్లు నిర్వాహకులు తెలిపారు. నేడుఉదయం 1గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయని మంచి ముగ్గులకు మంచి బహుమతులు అందజే స్తారని పాల్గొన్న ప్రతీఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందజేయబడు తోందని నిర్వాహకులు తెలిపారు. మహిళలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా వ్యాప్తంగా పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



సేయింట్ జేవియర్స్ పాఠశాలలో సంక్రాంతి వేడుకల దృశ్యం



విజయ్ హైస్కూల్‌లో పొంగలి తయారు చేస్తున్న ప్రిన్సిపాల్ కవిత



విద్యార్థులకు పతంగులను పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

నిజామాబాద్ అర్బన్, జనవరి 11: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని వర్నిరోడ్‌లో గల సేయింట్ జేవియర్స్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలను పల్లెవాతావరణం ఉట్టిపడేలా నిర్వహించారు. రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులతో ఆటలు, హరిదాసులపాటలు, బోగిపండ్లు, పిండివంటలు, బోగి మంటలతో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ నర్సింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి పండుగ యొక్క విశిష్టతను తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రతి పండుగను పాఠశాలలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పుష్ప, ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

● నవ్యభారతి పాఠశాలలో

నగర శివారులోని నవ్యభారతి గ్లోబల్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్నారు. విద్యార్థులందరికి ముగ్గుల పోటీలు, పతంగుల పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్‌టీ లత, వైస్ ప్రిన్సిపల్ సరిత, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంతో పాటు మండలంలోని చింతకుంట గ్రామంలోని నలంద విద్యానిలయంలో విద్యార్థులతో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఒక్కసారిగా పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నలంద విద్యానిలయం కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి విద్యార్థులతో భోగి మంటలు, రంగోలి ముగ్గులు, వేషధారణ, గంగిరెద్దుల నాటికలు, నృత్యం చేయించి అలరించారు. విద్యార్థులతో గాలి పటాలు ఎగరవేయించారు. ఈ సంబరాల్లో ప్రభుత్వ పాఠశాలు, ప్రైవేటు పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కమ్మర్‌పల్లిలోని మిసిమి, శ్రీవిద్యాసాయి, కృష్ణవేణి, విజ్ఞానజ్యోతి, ఉన్నతపాఠశాల తదితర పాఠశాలల్లో విద్యార్థులు గురువారం పోటీపడి రంగురంగుల ముగ్గుల పోటీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు వేసిన రంగురంగుల ముగ్గులను ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు బాలి రవిందర్, గంగారెడ్డి, చిలుక గంగాప్రసాద్, గుండోజి దేవేందర్, హైస్కూల్ హెచ్‌ఎం పసుపుల సాయన్న ఉపాధ్యాయులు పరిశీలించి ఉత్తమంగా వేసిన ముగ్గులను ఎంపిక చేసి విద్యార్థులకు బహుమతులు ప్రకటించి అందజేశారు. కాగా శ్రీవిద్యాసాయి విద్యార్థినిలకు ముగ్గులు, విద్యార్థులకు కైట్ ఫెస్టివల్ నిర్వహించి బహుమతులు అందజేశారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలోని విజయ్ హైస్కూల్‌లో గురు వారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు ప్రిన్సి పాల్ కవిత దివాకర్ సంక్రాంతి ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల ఉపాధ్యా యునిలు విద్యార్థినిలతో కలిసి బోగి మంటలు, పొంగలి, పిండి వంటలు వాటిపై అవగాహన కల్పించారు. విద్యార్థినిలు రంగురంగుల ముగ్గులు వేశారు. ముగ్గులు వేసిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముప్కాల్: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని పాఠశాలలో రంగోళి కార్యక్రమం నిర్వహించారు. గురువారం ముప్కాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, బాల్కొండ మండలంలోని వేంకటేశ్వర మదర్‌థెరిస్సా పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని మంచిప్ప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పోటా పోటీగా ముగ్గులు వేశారు. సంక్రాంతి సంప్రదాయాన్ని పురస్కరించుకొని విద్యార్థుల్లో సంస్కృతిని కలిపించేందుకు ముగ్గుల పోటీలను నిర్వహించడం జరిగిందని పాఠశాల ఉపాధ్యాయులు, వీడీసీ పెద్దలు పేర్కొన్నారు. ముగ్గులు వేసి అందరిని ఆకట్టుకునేలా వేశారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో గల పాఠశాలలలో గురువారం సంక్రాంతి సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కస్తూర్బ బాలికల గాంధీ ఆదర్శ పాఠశాల, తొర్లికొండ ప్రైమరీ పాఠశాల, నారాయణపేట్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించగా గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలను గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినిలకు ముగ్గుల పోటీలతో పాటు హరిదాసు కీర్తనలు, కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. ధర్పల్లి గ్రామంలో గల లిటిల్ హార్ట్స్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలను విద్యార్థులతో కలిసి వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలోపాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్, సాధన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ 14 విడత ప్రజావేదిక



ఉపాధిహమి ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్డీవో పీడీ సాయన్న

పిట్లం జనవరి 11: మహత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం 14వ విడత ప్రజా వేదిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కవిత అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గురువారం ప్రజావేదిక సమావేశంలో 2023-2024 సంవత్సర ఉపాధి పనులను డీఆర్పీలు చదివి వినిపించారు.మండలంలో రూ.1కోటి 86 లక్షల పనులు జరినట్లు నివేదికలు అధికారులు చదివి వినిపించారు.ధర్మారం, బుర్నాపూర్ ఆయా గ్రామాలలో ఉపాధి పనులలో సరైనా హాజరు వేయకుండా బిల్లులు తీసుకున్నారని వివరించారు.ఆయా గ్రామాలలో పనులలో జరిగిన పనులను ప్రజావేదికలో వివరించారు.గ్రామాల లో హరితహారం మొక్కల పెంపకం, గుంతలు తవ్వడం, కూలీలకు పనులపై హాజరుపట్టికలలో కూలీల హాజరు తప్పు వేయడం,ఆయా అంశాల ను డీఆర్పీలు సమావేశంలో తెలిపారు డీఆర్‌డీవోపీడీ సాయన్న మాట్లాడుతూ ఉపాధిహామీ పనులలో అక్రమానికి పాల్పడిన వారికి రికవరి చేయిస్తామని, ప్రతీ గ్రామంలో కూలీలకు పనులు కల్పిస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో ఎంపీపీ కవిత, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశం, ఎంపీవో బ్రహ్మం, ఏపీవో శివకుమార్, మండల అధికారులు ఉపాధి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యువజన ఉత్సవాలకు తరలిన సౌత్‌క్యాంపస్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భిక్కనూరు, జనవరి 11: మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే జాతీయ యువజన ఉత్సవాలకు భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు గురువారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపాల్ సుదాకర్ గౌడ్ మాట్లాడుతూ స్వామి వివేకానందా జయంతిని పురస్కరించుకుని మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12నుండి 16వరకు నాసిక్‌లో జరిగే యువజన ఉత్సవాలకు ఎన్‌ఎస్‌ఎస్-5 యూనిట్‌కు చెందిన శివకుమార్, పవన్ తరలివెళ్లడం జరిగిందన్నారు. ఈ యువజన ఉత్సవాల్లో నిర్వహించే సాంస్కృతిక పోటీలు, ఫుడ్ ఫెస్టివల్, యువకళాకారుల క్యాంపు, సాహస కృత్యాలలో వీరు పాల్గొంటారని తెలపారు. ఈ మేరకు యువజన ఉత్సవాలకు వెళ్లిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ అంజయ్య, అధ్యాపకులు మోహన్‌బాబు, నాగరాజు, శ్రీనివాస్, వీరభద్రం, రాజేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పక్కాగా అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో బట్టు రాజేశ్వర్

ముప్కాల్, జనవరి11: పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెను ప్రకారం పక్కగా అందించాలని మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్ ఆదేశించారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించి ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం పక్కగా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని విద్యార్థులకు మెనుప్రకారం వారినికి మూడు రోజులు కోడిగుడ్లు, తప్పనిసరి మధ్యాహ్న భోజనంలో ఉండేలా చూడాలని లేదంటే చర్యలు చేపడతామని సూచించారు. జడ్పీ, ఉన్నత పాఠశాలలు ఉన్నాయని సుమారు ఐదు వేల మంది విద్యార్థులు ఉన్నారని, ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వచ్చే విధంగా ప్రోత్సహించడంతో పాటు పేద, మధ్యతరగతి విద్యార్థులు ఎక్కువగా వస్తారని భావించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నాయని, 1నుంచి 8వ తరగతి వరకు కేంద్ర ప్రభుత్వం, 9, 10తరగతులకు రాష్ట్ర ప్రభుతవం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో నిబంధనలు కఠినంగా ఉన్నాయని ఇవీ అమలు చేయాలని స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల గోడలపై పాత మెను కాకుండా కొత్త మెను వివరాలు రాయించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వంట చూసిన తర్వాతనే విద్యార్థులకు పంపించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన కమిటీ ఏర్పాటు చేయాలని, వంట ఏజెన్సీల బియ్యంతో పాటు ఇతర సరుకులు విద్యార్థుల కమిటీ సమక్షంలో తూకం వేసి ఇస్తున్న వివరాలు రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు.

● మధ్యాహ్న భోజనం తనిఖీ

కోటగిరి: మండలంలోని ఎత్తొండ ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఎంపీటీసీ కొట్టం మనోహర్ పరిశీలించారు. విద్యార్థులకు రోజువారిగా మెనూ ప్రకారం భోజనం అందుతుందా అని ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించకుండా చూడాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో డైనింగ్ హాల్ ఏర్పాటుకు కృషి చేయాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు షాహీద్, ఉపాధ్యక్షులు ఖదర్, నాయకులు గంగాధర్ రావు దేశాయ్, తయబ్, రఫీ,తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ

డిచ్‌పల్లి, జనవరి 11: శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి నూతన ఉత్సహవిగ్రహల ఊరేగింపుతో పాటు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు నేడు ఉదయం 10గంటల నుంచి ధర్మారంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం సమూదాయం నుంచి ప్రారంభమవుతోందని ఈశోభాయాత్రకు మహిళలు మంగళహరతులతో హాజరుకావాలని ఆలయ కమిటీ ఛైర్మన్ రావుల బ్రహ్మనందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.కన్నుల పండుగగా జరిగే ఈ కార్యక్రమాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



జలాల్‌పూర్‌లో జొన్న పంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి

ముప్కాల్, జనవరి11: బాల్కొండ మండలం జలాల్‌పూర్ గ్రామంలో యాసంగి పంటలైన మొక్కజొన్న పంటలను గురువారం మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి పరిశీలించి సస్యరక్షణ చర్యలపై వివరించారు. జొన్నలో పెనుబంక నివారణకు రైతులు డైమితయేటు 400మిల్లి మీటర్లు, తయేమితాక్రైటమ్ 80గ్రాములు, ఎసిపెట్ 300గ్రాములు, 200 లీటర్ల నీటిలో కలుపుకొని ఎకరానికి పిచికారి చేయాలని ఆయన వివరించారు. బంకకారు తెగులు నివారణఖు కార్బెండజియం 200గ్రాములు, మాంకోజెల్, కార్బెండజిమ్ 250గ్రాములు 200లీటర్ల నీటిలో కలుపుకోని పిచికారి చేయాలని వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లింబారెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మిట్టపల్లి క్రీడాకారులు

డిచ్‌పల్లి, జనవరి 11: స్కూల్ గేమ్స్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీలకు మిట్టపల్లి పాఠశాల క్రీడకారులు శ్రీతిక, మణితేజ, ఎంపికయ్యారని ఉపాధ్యాయుడు సుశీల్‌కుమార్, వ్యాయమా ఉపాధ్యాయులు మార్కంటి గంగామోహన్ తెలిపారు. ఈ నెల 16నుంచి 18వరకు సాంఘిక సంక్షేమ పాఠశాల ఆర్మూర్ క్రీడామైదానంలో జరగనున్న 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర సాఫ్ట్ బాల్ అండర్-14 బాలబాలికల టోర్నమెంట్‌కు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మిట్టపల్లి క్రీడాకారులు శ్రీతిక, మణితేజాలు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వీరిని జాతీయ స్థాయికి ఎంపికయ్యేల ప్రతిభ చూపాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ కార్యర్శి వినోద్, ఉపాధ్యా యుడు రాజశేఖర్, రాఘవేందర్, బాలరాజు, శ్రీధరచార్యులు, పీఈటీ గంగామోహన్ లు అభినందించారు.

17 నుంచి డీఈఈ సెట్ రెండో విడత కౌన్సెలింగ్

నిజామాబాద్ అర్బన్, జనవరి 11: డీఈఈ సెట్ 2023కు సంబంధించి డీఈఎల్‌ఈడీ 2023-25 బ్యాచ్ కొరకు రెండవ విడత సర్టిఫికెట్ల పరిశీలన మరియు వెబ్‌ఆప్షన్ల కోసం అభ్యర్థులు ఈనెల 17న సంబంధిత డైట్ కళాశాలలో హాజరుకావాలని జిల్లావిద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఎల్‌ఈడీ, డీపీఎస్‌ఈ కోర్సుల కోసం ర్యాంకుల ప్రకారం అభ్యర్థులు వెబ్ ఆధారిత కళాశాలల ప్రాధాన్యతను ఈనెల 18నుంచి 22 వరకు సమర్పించాలని, 25న సీట్ల కేటాయింపు ఉంటుందని, జనవరి 26 నుంచి 29 వరకు ఫీజు చెల్లింపు, ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

పక్షుల వేటగాళ్ల పట్టివేత



పక్షుల వేటగాళ్ల పట్టివేత దృశ్యం

వర్ని, జనవరి 11 : వర్ని మండల కేంద్రంలో గురువారం ఇద్దరు వ్యక్తులు పక్షుల వేటలో విషపు పదార్థాలు కలిపి కాకులకు ఎరగా వేసి వేటాడుతుండగా స్థానికులు పట్టుకున్నారు. కాకులను పట్టుకుని ఏం చేస్తారని ప్రశ్నించారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఘటన స్థలానికి అటవీ శాఖ వర్ని డిప్యూటీ రేంజ్ అధికారి బాబు ఘటన స్థలానికి చేరుకున్నారు. కాకులకు విష పదార్థాలు కలిపి ఎక్కడికి తీసుకువెళుతున్నారని ప్రశ్నించారు. మృతి చెందిన కాకుల పట్టివేతపై వన్య ప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మృతి చెందిన కాకీలను ఎక్కడికి తీసుకెళుతున్నారని, ఏం చేస్తారని పూర్తిస్థాయి విచారణ చేపడుతున్నామన్నారు.

బైక్ అదుపుతప్పి కింద పడి ఒకరి మృతి

● బంధువుల అంత్యక్రియాలకు వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి

జక్రాన్‌పల్లి, జనవరి11:మండలంలోని మునిపల్లి గ్రామంలో 63వ జాతీయరహదారిపై గురువారం సాయంత్రం రోడ్డుప్రమాదంలో మునిపల్లి గ్రామానికి చెందిన గుడ్ల సురేష్(47) అక్కడికక్కడే మృతిచెంది నట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు.ఎస్సై సురేష్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలాఉన్నాయి. మునిపల్లి గ్రామంలో బంధువు మృతి చెందగా గుడ్ల సురేష్ అంత్యక్రియాలకు వచ్చామని తెలిపారు. అంత్యక్రియాల్లో పాల్గొని తిరిగి బైక్‌పై ఆర్మూర్ వెళ్తుండగా జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న బండరాయిపై పడ్డారని ఎస్సై తెలిపారు. దీంతో తీవ్రగాయాలు కావడంతో గుడ్ల సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ఆసుపత్రికి తరలించారు. మృతుడు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

లారీ, ఆటో ఢీ

● నలుగురికి గాయాలు

మోపాల్, జనవరి 11: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంజర్ గ్రామ సమీపంలో గురువారం ఉదయం ఆటోను లారీ ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మీసాల శేఖర్ నలుగురు విద్యార్థులను ఎక్కించుకొని కంజర్ గ్రామ సమీపంలో ఉన్న ఓ విద్యానికేతన్ హైస్కూల్‌లో విద్యార్థులను దింపి స్కూల్ దగ్గరలోనే రోడ్డుపైకి వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టడంతో బోల్తా పడింది. ఆటో డ్రైవర్ మీసాల శేఖర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. లారీ డ్రైవర్ కృష్ణ, ఒడిస్సాకు చెందిన ఇద్దరు కార్మికులు మహానంద్, సుశీల్‌దేవ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న మోపాల్ ఎస్సై గంగాధర్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. విద్యార్థులు ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉంటే తీవ్ర విషాదం నెలకొనేదని అక్కడున్న గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక బట్టీల లారీ డ్రైవర్లు అతివేగం, అజాగ్రత్తగా నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామస్థులు మండిపడుతున్నారు.



లారీ, ఆటో ఢీకొన్న దృశ్యం

రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ గేమ్స్‌లో జిల్లా విద్యార్థికి గోల్డ్‌మెడల్

నిజామాబాద్ అర్బన్, జనవరి 11: రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ గేమ్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఎలక్ట్రికల్ విద్యార్థి కార్తిక్ షాట్‌పుట్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతిగా బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ శ్రీరాంకుమార్ తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ పోటీలను నిర్వహించారు. జిల్లాకు చెందిన విద్యార్థి గోల్డ్‌మెడల్ సాధించడంపై ప్రిన్సిపల్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు క్షేత్ర పర్యటన



పంటను పరిశీలిస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

సిరికొండ జనవరి 11: విద్యాభ్యాసంతో పాటు పంటలను సాగుచేడ మేలా అని తెలుసుకోవడానికి గురువారం మోడల్ స్కూల్ విద్యార్థులు క్షేత్ర సందర్శన చేశారు. వృత్తి విద్యాభ్యాసంలో భాగంగా మండల కేంద్రానికి చెందిన మోడల్ స్కూల్ విద్యార్థులు పంట చేనులోకి వెళ్లి రైతులతో విద్యార్థులు మాట్లాడి ఏఏపంట సాగు విధానం ఎలాఉంటుందో అడిగి తెలసుకున్నారు.ఉపాధ్యాయులు జాడి సాయివినయ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పంటల పరిశీలనకు వెళ్లారు.తైవాన్ జామ సాగు చేయడం వల్ల కలిగే లాభాలను రైతును అడిగి తెలుపుకున్నారు.ఆర్గానిక్ ఎరువులతో పంటలను సాగు చేయడం వల్ల అనేక అనార్థాలను దూరం చేసినట్లు అవుతోందని ఉపాధ్యాయులు సాయివినయ్ తెలిపారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

రెంజల్,జనవరి11: మండలంలోని నీలా గ్రామంలో అక్రమంగా డంప్ చేసిన నాలుగు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయం నందు డంప్ చేసిన ఇసుకను గురువారం తహసీల్దార్ రాంచందర్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. వేలంలో 8మంది సభ్యులు పాల్గొనగా యంచ గ్రామానికి చెందిన రాజు 10,500రూపాయలకు వేలంలో ఇసుకను కొనుగోలు చేశారు. వేలంలో కొనుగోలు చేసిన ఇసుకను తరలించాలని వేలం నిర్వాహకుడు రాజుకు తహసీల్దార్ సూచించారు.కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

చైనా మాంజా పట్టివేత

నవీపేట,జనవరి11: మండల కేంద్రంలో గురువారం గాలిపటాలు విక్రయించే దుకాణంలో చైనామాంజాను పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. సుమారు రూ.2వేల విలువైన నిషేధిత చైనా మంజాను పట్టుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. చైనామంజాను విక్రయించడం చట్టరీత్యానేరమని ఆయన పేర్కొన్నారు.

● కోడిపందెలు ఆడితే చర్యలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలో ఎక్కడా కోడి పందెలు ఆడినట్లయితే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ యాదగిరి గౌడ్ హెచ్చరించారు. కోడి పందెలు ఆడడం నిషేధమని, ఎక్కడైన ఆడినట్లు తెలిస్తే తమకు సమామాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు.

గాలిపటాల దుకాణదారులకు అవగాహన

మోస్రా,జనవరి11: మోస్రా మండలంలోని పతంగుల మాంజాలు అమ్మే దుకాణాలపై తనిఖీ చేపట్టారు. ఫారెస్ట్ రీజినల్ ఆఫీసర్ పద్మారావు ఆదేశాల మేరకు బీట్ ఆఫీసర్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించి అవగాహన కల్పించారు. కేవలం దారంతో మాత్రమే పతంగులు ఎగురవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ ప్రభాకర్, బీట్ ఆఫీసర్ దుకాణదారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సీడీపీవో

రెంజల్,జనవరి11: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీవో జానకమ్మ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఒకటవ సెంటర్, 3వ, 4వ సెంటర్‌లను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలా రాణితో కలిసి తనిఖీ నిర్వహించారు. కేంద్రాల్లోని అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు సమయపాలన పాటించాలని, టైంటెబుల్ ప్రకారం ప్రీస్కూల్, మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఫుడ్ స్టాక్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సురేఖ, సుజాత, రాణి, తదితరులున్నారు.

నలంద పాఠశాలలో మ్యాథ్స్ ఎగ్జిబిషన్

పెర్కిట్, జనవరి11: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గల నలంద పాఠశాలలో గురువారం మ్యాథ్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈసం దర్భంగా విద్యార్థులు మ్యాథ్స్‌లోని కఠినమైన ప్రశ్నాలకు సులువుగా సమాధానాలు తెలియపర్చేలా గణితశాస్త్రంలో ఉన్న మేళకువలకు సంబంధించిన పలురకాల నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. భవిష్యత్‌లో కాంపిటేటీవ్ పరీక్షలలో విజేతగా నిలబడానికి తోడ్పడుతోందని పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ సాగర్ విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బడి బయట పిల్లలను గుర్తిస్తున్న సిబ్బంది

బడి బయట పిల్లల సర్వే

నిజాంసాగర్, జనవరి 11: మండలంలో గోర్గల్ హాబిటేషన్‌లో బడి బయట పిల్లల సర్వే నిర్వహించినట్లు హెచ్‌ఎం రాంచందర్ తెలిపారు. 14 సంవత్సరాలు కలిగిన 6వ తరగతి విద్యార్థులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ వరలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, తదితరులున్నారు.

మోడల్ పాఠశాలలో ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

మద్నూర్, జనవరి 11: తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఖాళీ సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని వెల్లడించారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.



కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

అలరించిన కుస్తీ పోటీలు

పెద్ద కొడప్‌గల్, జనవరి 11: ఎలాల అమావాస్య పర్వదినం సందర్భంగా మండలంలోని పెద్దఏడ్గి గ్రామంలో ఏర్పాటు చేసిన కుస్తీ పోటీలు ప్రజలను అలరించాయి. ఎలాల అమావాస్య సందర్భంగా పెద్దఏడ్గి ప్రజలు ఉదయాన్నే పంట చేలకు చేరుకుని రబీ పంటలు సమృద్ధిగా పండాలని పాండవులకు ప్రత్యేకంగా జొన్న కంకులతో ఆలయం నిర్మించి పూజలు నిర్వహించారు, అనంతరం సాయంత్రం గ్రామ శివారులో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు తెలంగాణ ప్రాంతం వారే కాకుండా సరిహద్దు రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కొబ్బరి కాయతో ప్రారంభమైన ఈ కుస్తీ పోటీలు 11 తులాల వెండి కడియంతో ముగిసాయి. అంతాపూర్‌కు చెందిన మల్లయోధుడు 11 తులాల వెండి కడియాన్ని గెలుచుకున్నట్లు సర్పంచ్ వినోద్ తెలిపారు.



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిషన్ భగీరథ నీటి దుర్వినియోగంపై ఫిర్యాదు

పెద్ద కొడప్‌గల్, జనవరి 11: మండలంలోని వివిధ గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు దుర్వినియోగం అవుతుందని ఈ విషయంపై విచారణ చేపట్టాలని గురువారం కాంగ్రెస్ నాయకులు ఎంపీడీవో రాణికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రాంసింగ్ మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మిషన్ భగీరథ నీటిని మోటార్ల ద్వారా పంటల సాగు కోసం వాడుకుంటున్నారని, దీంతో ప్రజలకు తాగు నీటికి ఇబ్బంది ఎదురవుతుందని తెలిపారు. ఈ విషయంలో విచారణ జరిపి మిషన్ భగీరథ నీరు దుర్వినియోగం కాకుండా చూడాలని వినతి పత్రం అందజేశారు.



రేషన్ డీలర్లతో మాటాడుతున్న తహసీల్దార్

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి

మద్నూర్, జనవరి 11: రేషన్ డీలర్లు సమయ పాలన పాటించాలని, లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలని మద్నూర్ తహసీల్దార్ ముజీబ్ సూచించారు. గురువారం మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సమయ పాలన పాటించాలని, ప్రతీ దుకాణం వద్ద బోర్డు పెట్టాలని, సకాలంలో డీడీలు చెల్లించాలని, తదితర సూచనలు అందజేశారు.

ప్రతి ఒక్కరూ దైవ చింతనలో కొంత సమయం గడపాలి



కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

సదాశివనగర్, జనవరి 11: ప్రతీ మానవుడు జీవితంలో కొంతకాలం దైవచింతనలో గడపాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. సదాశివనగర్ మండలం లింగంపల్లి శ్రీకృష్ణమందిరం వద్ద మూడు రోజుల పాటు నిర్వహించిన విశ్వశాంతి గీతాయజ్ఞం చింతన్ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హాజరై మాటాడారు. కామారెడ్డి జిల్లాకు ఎంతో అందంగా సర్వమానవాళికి గీత సందేశాన్ని అందిస్తున్న లింగంపల్లి శ్రీకృష్ణ మందిరం పవిత్రమైనదని అన్నారు. సుమారు 3వేల మంది మహానుభావులు భక్తులతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భగవంతుని కృపతో పాటు దాతల సహకారం మరువరానిదని అన్నారు. లింగంపల్లి శ్రీకృష్ణమందిరం పీఠాధిపతులు మాచాలేబాబా, చక్రపాణి బాబాలు భక్తులకు నిత్యం దీవెనలు అందిస్తు హిందూ ధర్మ ప్రచారంగా భగవద్గీత ప్రతీ వ్యక్తికి చేరే విధంగా కృషి చేయడం అభినందనీయమని అన్నారు. అనంతరం మహానుభావులు ఎంపీకి, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహానుభావులు సారంగబాబా, మురళీబాబా, మనోహర్‌బాబా, మోహన్‌బాబా, కిషన్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

జంగంపల్లిలో సావిత్రీబాయి పూలే జయంతి ముగింపు సభ



జంగంపల్లి జ్యోతిబాపూలే పాఠశాలలో ముగింపు కార్యక్రమానికి హాజరైన విద్యార్థినులు

భిక్కనూరు, జనవరి 11: జంగంపల్లిలో మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి ముగింపు సభ కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ విద్యార్థులు సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని, 10వ తరగతి విద్యార్థులు బాగా చదివి పబ్లిక్ పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కాగా బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాఠశాలలోని 14 మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి పాఠశాల 10వ తరగతి విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్స్‌ను అందజేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మణిదీప్తి, బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీశైలం, నరేందర్, సాయిమౌర్య, తదితరులు పాల్గొన్నారు.



సూరాయిపల్లిలో యువజన క్రీడలను ప్రారంభిస్తున్న సలాం

విద్యార్థులు దేశభక్తితో పాటు సంఘసేవ అలవర్చుకోవాలి

- జిల్లా ఇంటర్ విద్యాధికారి శేఖ్ సలామ్

లింగంపేట, జనవరి 11: విద్యార్థులు దేశభక్తితో పాటు సంఘసేవ అలవర్చుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి శేఖ్ సలామ్ అన్నారు. ఆయన గురువారం లింగంపేట మండలంలోని సూరాయిపల్లి, మెంగారం గ్రామాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ సీతాకాల శిబిరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఒక మనిషి మరొక మనిషికి సహకరించడం మానవతా లక్షణం. మనం పది మందిలో ఉన్నప్పుడు మనవల్ల పది మందికి ప్రయోజనం ఉండాలని ఆయన సూచించారు. నాయకత్వ లక్షణాలను ప్రజాస్వామిక విలువలను పెంచుకోవాలని ఆయన తెలిపారు. జాతీయ సమైక్యతా సామాజిక అవసరాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని ఆయన తెలిపారు. సూరాయిపల్లిలో విద్యార్థులతో కలిసి అమృతాలయాన్ని, మెంగారంలో శివాలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సూరాయిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న యువజన క్రీడలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేందర్, సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మాకం రాములు, కో ఆర్డినేటర్లు ధర్‌సింగ్, రాజయ్య, అధ్యాపకులు నిజాం, ఫణికుమార్, శివ, నాగు, స్వామి, అంజయ్య, శ్రీకాంత్, రజాక్, నాగయ్య, రాజేష్‌లతో పాటు విద్యార్థులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎలమ అమావాస్య పండుగ

మద్నూర్, జనవరి 11: మండల కేంద్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎలమ అమావాస్య పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి యేడాది సంక్రాంతికి ముందు జరుపుకునే ఎలమ అమావాస్య పండుగను అధిక మాసంలో బోగి పండుగకు రెండు రోజుల ముందే జరుపుకున్నారు. మండలంలోని పెద్ద తడ్గూర్, ఎక్లారా, ఆవల్‌గాం, డోంగ్లీ, సుల్తాన్ పేట్ గ్రామాలలో కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకున్నారు. బంధు మిత్రులు, కుటుంబ సభ్యులతో కలిసి మొక్కజొన్న చేల్లలోకి వెళ్లి కర్రలతో ఏర్పాటు చేసిన గుడిలో లక్ష్మీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంధువులు, మిత్రులతో కలిసి వన భోజనాలు చేశారు.

భక్తులకు స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ

బీర్కూర్, జనవరి 11: మండలం తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో ధనుర్మాస కార్యక్రమాలు నిత్యం కొనసాగుతున్నాయి. గురువారం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామి వారిని అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇదిలా ఉండగా డాబా శ్రీనివాస్ అనే భక్తుడు ధనుర్మాసం సందర్భంగా నిత్యం ఆలయానికి వచ్చే భక్తులకు స్టీల్ వాటర్ బాటిళ్ళను ఇవ్వాలని తలంచాడు. సొంత ఖర్చులతో బాటిళ్ళను కొనుగోలు చేసి 80 బాటిళ్లను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్, జనవరి 11: కాంట్రాక్ట్ ప్రాతిపదికన భరోసా సెంటర్‌లో లీగల్ సపోర్ట్ పర్సన్ కౌన్సిలర్(1-పోస్టు), సపోర్ట్ పర్సన్(2-పోస్టులు), రిసెప్షన్(1-పోస్టు), ఏఎన్ఎం(1-పోస్టు)లుగా పని చేయుటకు మహిళ అభ్యర్థుల నంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎస్పీ సింధూశర్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక సంవత్సర కాల వ్యవధి కోసం మాత్రమేనని కాలవ్యవధి ఆవశ్యకత, బడ్జెట్ ప్రకారం ప్రతీ సంవత్సరం పొడగించబడుతుందని తెలిపారు. బయోడెటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ అడిగిన పత్రాలు అన్ని పోలీసు ప్రధాన కార్యాలయంలోని ఇన్వార్డ్ సెక్షన్‌లో ఇవ్వాలని సూచించారు. దరఖాస్తులకు చివరి తేదీ ఈనెల 20 సాయంత్రం 5 గంటల వరకు మాత్రమేనని తెలిపారు. లీగల్ సపోర్ట్ పర్సన్ కౌన్సిలర్‌కు వయస్సు 25 నుంచి 40 సంవత్సరాలలోపు ఉండాలి. నెలసరి జీతం రూ.22వేలు, విద్యార్హత ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎమ్, స్వతంత్రంగా లేదా సీనియర్ న్యాయవాదిలో కలిసి మహిళలు, పిల్లలకు సంబంధించిన 10 కేసులకు తగ్గకుండా పరిష్కరించగలిగి ఉండాలి. మిగిలిన వివరాలకు డీసీఆర్‌బీ సీఐ శ్రీధర్‌రెడ్డి (8712686088) నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

రైతులు వ్యవసాయ సూచనలు పాటించాలి

గాంధారి, జనవరి 11: మండల పరిధిలోని సీతాయిపల్లి, గండివెట్ గ్రామాల్లోని జొన్న, మొక్కజొన్న పంటలను వ్యవసాయ సహాయ సంచాలకులు రత్న పరిశీలించారు. జొన్నలో కాండం తొలుచు పురుగు, మొక్కజొన్న పంటలో కాండం తొలిచే పురుగు, కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించారు. వీటి నివారణ కోసం ఎమ్మామెక్టిన్ బెంజోయేట్ 5 శాతం, ఎస్‌జీ 100 గ్రాములు ఎకరానికి లేదా క్లోరాన్ ట్రనిలిప్రోల్ 18.5 శాతం ఎస్ఎల్ 60మి.లీ ఎకరానికి పిచికారీ చేసి మంచి ఫలితాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి నరేష్, ఏఈవో షోయబ్ అహ్మద్, రైతులు పాల్గొన్నారు.

కళాజాతా ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన

మాచారెడ్డి, జనవరి 11: పాల్వంచ మండలంలోని భవానిపేట తండా, ఆరేపల్లి గ్రామాల్లో కళాజాతా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను నివారణ అంశాలపై పాటల రూపంలో కళాజాత బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. రాష్ట్రఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే సిగరెట్, గుట్కా,అంబార్ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాజాతా బృందం సాయిలు, శ్రీనివాస్, రమేష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

బాన్సువాడ టౌన్, జనవరి 11: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 12 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులను విద్యాశాఖ ప్రకటించినట్లు మండల విద్యాధికారి నాగేశ్వరరావు తెలిపారు. తిరిగి ఈ నెల 18న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో హాస్టల్ విద్యార్థులు తమతమ ఇళ్లకు పయనమయ్యారు. విద్యార్థులు ఇళ్లకు వెళ్లడంతో ప్రయాణ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి.

బూత్ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

బాన్సువాడ, జనవరి 11: బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని, గ్రామ గ్రామాన కేంద్రం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చెప్పాలని, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. గురువారం ఆయన బాన్సువాడ పట్టణానికి విచ్చేశారు. ఆయన రాకతో బాన్సువాడ బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీని కింది స్థాయి నుంచే బలతోపేతం చేసినపుడే ఎన్నికల్లో విజయం సిద్ధిస్తోందన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల వరకు ప్రతీ ఒక్కరు అలుపెరుగని శ్రామికుల్లా పని చేయాలని, బాన్సువాడ నియోజకవర్గంలో ఎక్కువ మొత్తంలో ఓట్లు బీజేపీకే పడేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, మాజీ ఎమ్మెల్యే యెండెల లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి..

గాంధారి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కామారెడ్డి ఎమ్మెల్యే, జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం గాంధారి మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో పార్లమెంట్ సన్నాహాక సమావేశంను నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీని గ్రామగ్రామన బలోపేతం చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక ఎంపీ సీట్లు గెలిపించుకుని తెలంగాణలో బీజేపీ ఘన విజయం సాధించాలని ఆయనఅన్నారు. దేశాన్ని ప్రధాని నరేంద్రమోదీ ఎంతో ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అరుణ తార, మురళిధర్‌గౌడ్, వడ్డెపల్లి సుభాష్‌రెడ్డి,బాణాల లక్ష్మారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు సాయిబాబా, రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కామారెడ్డిటౌన్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జహిరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు వివరించాలని సూచించారు. జహిరాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ గెలుపుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని అన్నారు. ముఖ్యంగా కామారెడ్డిలో బీజేపీకి అత్యధికంగా మెజార్టీ వచ్చేవిధంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జహిరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ బద్దంమహిపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు అరుణతార, మురళీధర్‌గౌడ్, చిన్నరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఒడ్డెర ఓబన్న జయంతి



రామేశ్వర్‌పల్లి గ్రామంలో ఓబన్న జయంతి నిర్వహిస్తున్న దృశ్యం



ఉత్తనూర్‌లో ఓబన్న జయంతి..

సదాశివనగర్, జనవరి 11: మండలంలోని ఉత్తనూర్‌లో వడ్డెర ఓబన్న జయంతిని వడ్డెర సంఘం ప్రతినిధులు గురువారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న ఆనాటి పోరాటపటిమను, స్వాతంత్రానికి ఎంతో దోహదపడిందని అన్నారు. వడ్డెర కులానికి చెందిన ప్రతి ఒక్కరూ ఓబన్నను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ర్యాపని సహేందర్, ఓర్సునాగయ్య, ఓర్సుపోషయ్య, రాజయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో స్వాతంత్ర సమరయోదుడు ఒడ్డె ఓబన్న జయంతిని గ్రామ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఆయాపార్టీల నాయకులు, వడ్డెర సంఘం ప్రతినిధులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ మేరకు వడ్డెర సంఘం సభ్యులు మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడా లేని విధంగా స్వాతంత్ర సమరయోధుడు ఓబన్న గ్రహాన్ని ప్రతిష్ఠించిన మద్ది చంద్రకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోలిరెడ్డి, ఎంపీటీసీ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ తక్కళ్ల నర్సారెడ్డి, చేపూరా రాజు, వడ్డెర సంఘం అధ్యక్షుడు గంగాధర్, వడ్డెర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబురాలు

మద్నూర్, జనవరి 11: మండల కేంద్రంలోని ఆయా పాఠశాలల్లో సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేస్తూ పాఠశాల యాజమాన్యం పలు కార్యక్రమాలను నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులు పలు రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. సంక్రాంతి ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు వేసిన ముగ్గులు కనువిందు చేశాయి. మారదాసులతో పంచ పాండవులకు పూజలు చేసి, సామూహిక భోజనాలు ఏర్పాటు చేశారు. రోజురోజుకు పండుగల విశిష్టతలను కోల్పోతుండటంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు పండుగల ప్రాముఖ్యత గురించి కార్యక్రమాలు నిర్వహించడంపై పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎల్లేష్

భిక్కనూరు, జనవరి 11: మండలంలోని బస్వాపూర్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన తలారి ఎల్లేష్(29) తన బైక్‌పై భిక్కనూరుకు వెళ్లి తిరిగి బస్వాపూర్‌కు వస్తుండగా గ్రామ సమీపంలో అదేవైపు వెళ్తున్న కంటైనర్ లారీ వెనుకాల నుంచి ఢీకొని అతడిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మృతుడి తల్లి దండ్రులు లక్ష్మి-రాజయ్య, గ్రామస్థులు పెద్దఎత్తున సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహంపై పడి బోరున విలపించారు. కొన్ని క్షణాలైతే ఇంటికి చేరుకుంటుండే, మాకెవ్వరు దిక్కు అంటు మృతుడి తల్లిదండ్రులు బోరున విలపించారు. వారిని ఓదార్చడం అక్కడున్న ఎవరితో కాలేదు. ఈ విషయం తెలుసుకున్న భిక్కనూరు ఎస్సై సాయికుమార్ సిబ్బందితో అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఎల్లేష్‌ను ఢీకొన్న లారీ పారిపోతుండగా అక్కడే ఉన్న గ్రామస్థులు లారీని వెంటపడి పట్టుకుని లారీ డ్రైవర్‌ను పోలీసులకు అప్పగించారు. రోడ్డు ప్రమాదం కారణంగా రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలను పోలీసులు పునరుద్ధరించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి		బాన్సువాడ	
ప్రియా 35	సలార్	మహేశ్వరి	గుంటూరు కారం
దర్శన్	ది బ్రిటీష్ సీక్రెట్ ఎజెంట్		
శాంతి	ఎనిమల్		
ప్రియా 70	హాయ్ నాన్న		

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

